
# సింగిల్ పేజీ కథలు

## యూజ్ అండ్ త్రో



"రేయ్ ఆకాష్! చాయ్ తాగుదామా!" అడిగాడు ఈశ్వర్.

"పదా"

ఇద్దరూ ప్యారడైజ్ కేఫ్‌కి వెళ్ళారు. బిల్లు చెల్లించాక రెండు ప్లాస్టిక్ కప్పులలో చాయ్ అందించాడు సేల్స్‌మెన్.

ఆకాష్, ఈశ్వర్ కబుర్లు చెప్పుకుంటూ చాయ్ తాగాక, ప్లాస్టిక్ కప్పులను డస్ట్‌బిన్‌లో పడేసి బయటకు నడిచారు.

"సరేరా!..రేపు కలుద్దాం" అంటూ విడిపోయారు.

ఆకాష్ ఇంటి వైపు వెళ్తుంటే తల్లి పండ్లు తీసుకురమ్మని చెప్పడం గుర్తుకొచ్చింది. అతడు బైక్‌ని ఓ ఫ్రూట్ షాప్ ముందు ఆపి, పండ్లు కొన్నాడు. షాపువాడు ఆ పండ్లు ఓ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లో వేసి అందించాడు.

ఇంటికెళ్ళాక అతడు తల్లికి ఆ బ్యాగ్ అందిస్తే, ఆవిడ ఫ్రూట్స్ ఫ్రిజ్‌లో పెట్టి, క్యారీ బ్యాగ్ డస్ట్‌బిన్‌లో పడేసింది.

ఆ సాయంత్రం ఆకాష్ తండ్రి అమర్‌నాథ్ భార్య రమాదేవితో అన్నాడు. "సెకండ్ షో సినిమాకి వెళ్దామా?"

"మీకు సినిమాకెళ్ళాలనే కోరిక కలగడమే అరుదు. అలాంటి మీరు అడిగాక, కాదనకుండా ఎలా వుండగలం?" ఆవిడ నవ్వింది.

ఆ రాత్రి ముగ్గురూ క్రాస్‌రోడ్స్‌లో సినిమాకెళ్ళారు.

హాలులో అమర్‌నాథ్ కూల్‌డ్రింక్ టిన్స్ తీసుకున్నాడు. డ్రింక్ తాగాక టిన్‌లు డస్ట్‌బిన్‌లో పడేసారా ముగ్గురూ.

* * *

ఆకాష్‌కి ఉద్యోగం వచ్చింది. ఆఫీసులో నీలిమ పరిచయమైంది. ఆ పరిచయం కలిసి సినిమాలు, షికార్లు తిరిగే వరకూ వెళ్ళింది. వారిద్దరూ అంతటితో ఆగలేదు. శారీరక సుఖాలనూ అనుభవించారు.

అలా కొంతకాలం గడిచాక నీలిమ అతడిని అడిగింది "ఆకాష్! మనమిక పెళ్ళిచేసుకుంటే బాగుంటుందనుకుంటాను"

"కానీ నేను బాగుంటుందని అనుకోవటం లేదు"

"ఎందుకని?"

"నీ మీద నాకు బోర్ కొట్టింది"

నీలిమ రెండు క్షణాల మౌనం తర్వాత ప్రశ్నించింది "మరి ఇప్పుడు నా పరిస్థితి?"

"చూడు నీలిమా! మన సమాజం ఎంతో ఫాస్ట్‌గా వుంది. ఏ బరువు బాధ్యతలు లేకుండా, అభిమానం, ఆప్యాయతలకు చోటు లేకుండా 'యూజ్ అండ్ త్రో' కాలంలో బ్రతుకుతున్నాం. ఇప్పుడు మనిద్దరం ఒకరినొకరు ఆనందం కోసం ఉపయోగించుకున్నాం. ఆ తర్వాత వదిలేస్తున్నాం. ఇట్స్ సింపుల్" జవాబిచ్చాడు అతడు.

"మరి ఈ విషయంలో నేను మీ మమ్మీడాడీలను కలిస్తే?"

"ఇలాంటి సమాధానమే వస్తుందనుకుంటాను"

"అదీ చూద్దాం" అంది నీలిమ.

నీలిమ చెప్పినదంతా ప్రశాంతంగా విన్నారు అమర్‌నాథ్, రమాదేవి.

"మరి మీ అభిప్రాయం ఏమిటి?" చివరగా అడిగింది ఆమె.

అమర్‌నాథ్ అరనిముషం ఆలోచించాక చెప్పాడు "మా వాడికి ఇష్టంలేని పని మేము చేయలేము కదమ్మా! ఐనా మావాడు చెప్పిన దాంట్లోనూ కొంత వాస్తవముంది. సమాజం మారింది. టీనేజ్‌లో కలసి తిరగడం కామన్ అయిపోయింది. కలిసి తిరిగినప్పుడు తప్పు జరగడం కామన్. తప్పు జరిగింది కదాని, ఇష్టం లేకుండా జీవితాంతం కలిసి బ్రతకాలనుకోవటమూ కష్టమే. ఈ విషయంలో మేమేమీ చేయలేం"

నీలిమ లేచింది. "సో! మీ అబ్బాయి చెప్పిన 'యూజ్ అండ్ త్రో' పాలసీని మీరూ సమర్థిస్తున్నారన్నమాట. ఓ.కె." ముఖంలో ఎలాంటి భావమూ కదలాడకుండా జాగ్రత్తపడుతూ వెళ్ళిపోయింది.

పెద్ద బరువు తగ్గినట్లు ఆ దంపతులు రిలాక్స్ ఫీలయ్యారు.

* * *

ఆకాష్‌కి కోమలితో పెళ్ళయ్యింది.

ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో విదేశాల్లో ఉద్యోగానికి అప్లయ్ చేసి, సంపాదించారు. కొడుకు, కోడలు అమెరికా వెళ్ళిపోయి ఇక తిరిగి రావటం లేదని తెలిసి అమర్‌నాథ్ కొడుకును అడిగాడు "ఆకాష్! ఈ వయసులో మమ్మల్ని ఇలా వదిలి అంతదూరం వెళ్ళడం ఎంతవరకూ న్యాయం?"

"మీరూ ఇలా మాట్లాడుతున్నారేంటి డాడీ! బరువు బాధ్యతలు అభిమానం ఆప్యాయత-ఇవన్నీ అమాయకమైన మాటలు. జీవితంలో ఇన్‌స్టెంట్‌గా దొరికే ఆనందాలకే విలువ ఇచ్చే తరం మాది. మీ కోసం ఆ ఆనందాలను వదులుకోవడం నాకిష్టం లేదు" చెప్పాడు ఆకాష్.

అమర్‌నాథ్ ఆవేశపడలేదు. "జీవితంలో ప్రతీదీ వాడుకుని పారేసే తరం వారిది ఆ 'యూజ్ అండ్ త్రో' పాలసీని తనలాంటి కొంతమంది తల్లిదండ్రులు సమర్థిస్తున్నారు. అందుకే వాళ్ళు చివరికి తల్లిదండ్రులనూ 'యూజ్ అండ్ త్రో' అంటూ వదిలేసి వెళ్తున్నారు. విత్తు ఒకటి నాటితే చెట్టు మరొకటి రాదు. వారి మనసుల్లో మనం నాటే భావాలే, మన పట్ల వారి చర్యలను నిర్దేశిస్తాయి తన కొడుకుకి తను 'యూజ్ అండ్ త్రో' పాలసీనే నేర్పాడు మరి'!

"మమ్మల్ని కూడా 'యూజ్ అండ్ త్రో' అంటూ వదిలించుకున్నందుకు థాంక్స్‌రా" కొడుకుకు షేక్‌హాండ్ ఇచ్చాడు అమర్‌నాథ్.

-జె.సునీల్ (హైదరాబాద్)

ooo

రెండు రోజులబట్టి శ్యామల యింటికెళదామంటే కుదరటం లేదు. రెండో శనివారం, ఆదివారం శ్రీవారికి, పిల్లలకీ కూడా శెలవే అవడం వల్ల తండ్రీ, పిల్లలు కలిసి యిల్లు పీకి పందిరేస్తున్నారు. ఆటలతో, పాటలతో, వాళ్ళకి కావలసినవన్నీ అవసరానికి తగ్గట్టు అందించకలేక నా తలప్రాణం తోక్కొస్తోంది.

సాధారణంగా నేనెవరిళ్ళకీ వెళ్ళాలనుకోను. తీరిక దొరికితే పుస్తకమేదేనా చదువుకోవడమో లేక గార్డెనింగో అదీకాకపోతే కుట్లు, అల్లికలతోనో కాలక్షేపం చేసేస్తాను. అయితే మొన్న పెరట్లో పూసిన కనకాంబరాలు కోసి పిల్లలు స్కూలు నించి తిరిగి వచ్చేలోగా వచ్చేద్దామని పువ్వులు శ్యామలకివ్వ దానికని బయలుదేరా. మా యింటి పక్కవీధిలోనే వాళ్ళిల్లు. శ్యామల, నేను ఒకే వూరి వాళ్ళం. అక్కడ ఎక్కువ పరిచయం లేకపోయినా యిద్దరి అత్తవారి వూరు కూడా ఒకటే కావడంతో ఒక పేరంటంలో కలుసుకొని కబుర్లలో వివరాలు తెలుసుకొని పరిచయాలు పెంచుకొని ఒకరిళ్ళకొకరం అప్పుడ

ప్పుడు రాకపోకలు సాగిస్తున్నాం.

వాళ్ళ సందు మలుపు తిరిగేటప్పటికి శ్యామల వీధి గుమ్మంలోనే నిలబడి బొమ్మలు బేరం చేస్తోంది. తోపుడు బండి మీద పెట్టుకొని రకరకాల రంగులు వేసిన మట్టిబొమ్మలు అమ్మకానికి తెచ్చాడా అబ్బాయి.

నన్ను చూడగానే "రారా..జానకీ. సమయానికొచ్చావ్. చూడు. ఈ బొమ్మలెంత అందంగా వున్నాయో" ఆహ్వానించింది శ్యామల. నిజంగానే అవి చూడముచ్చటగా వున్నాయి. ఏ కళాకారుడు చేసాడో కాని జీవకళ వుట్టిపడుతున్నాయి. అన్నిటిలో రాధాకృష్ణుల బొమ్మ నన్ను చాలా ఆకర్షించింది. అయితే నేనేమి డబ్బులు పట్టుకెళ్ళకపోవడం వల్ల అంత అందమైన బొమ్మను వదులుకోవడం యిష్టం లేకనూ శ్యామల దగ్గరే వంద రూపాయలు తీసుకొని రాధాకృష్ణులను నా స్వంతం చేసుకున్నాను. శ్యామల ఏనుగు బొమ్మను తీసుకుంది.

ఆ వంద రూపాయలు యివ్వడానికి ఈరోజు కుదిరింది.

తొమ్మిదయ్యేటప్పటికి పిల్లలు స్కూలుకు, శ్రీవారు ఆఫీసుకు దయచేసారు. వంటయిపోయి ఎవరి కేరేజ్‌లు వాళ్ళకిచ్చేసాను. ఇంక సాయంకాలం దాకా నాకు తీరికే.

గుమ్మం మెట్టు ఎక్కుతున్నాను. తలుపు దగ్గరికి వేసుంది. తలుపు తొయ్యబోయాను. లోపలినుంచి శ్యామల గొంతు పెద్దగా వినిపిస్తోంది. ఎవరి మీదనో గట్టిగా అరుస్తోంది. 'పిల్లలు స్కూలు కెళ్ళకుండా యింట్లోనే వుండి అల్లరి చేస్తున్నారేమో అందుకే అలా అరుస్తోంది వాళ్ళ మీద' అనుకుంటూ తలుపు తోసుకుని లోపలి కడుగుపెట్టా.

అక్కడి సీను మరొకలా వుంది. నిర్ఘాంత పోవడం నావంతయింది. శ్యామల ఉగ్రనరసింహావతారంలో వుంది. ఎదురుగుండా గోడకు ఆనుకొని పార్వతి తలవంచుకొని నిలబడి వుంది. ఎంతసేపటి నుంచో ఏడుస్తున్నట్టు ఆ కళ్ళు, బుగ్గల మీద కన్నీటి చారలే చెబుతున్నాయి.

తలుపు చప్పుడు విని యిటు తిరిగిన శ్యామల లోపలి కడుగుపెడుతున్న నన్ను చూసి "రారా..జానకీ...మంచి సమయానికే వచ్చావు. చూసావా దీని నిర్వాకం. మంచిది, మంచిది అని తెగ పొగిడేవు. చూడు ఏం చేసిందో. మీ పార్వతి" అంది.

"పార్వతా...ఏం చేసింది" అన్నాను తెల్లబోతూ.

"మంచిదానిలా వుంటూనే దాని బుద్ధిప్రదర్శించుకొంది. అమ్మో..ఎంత నంగనాచిలా వుండేది. ఏమో అనుకున్నా...హూ..యింట్లో మనిషిలా యిల్లంతా తిరగనిచ్చా. బాగా బుద్ధొచ్చేటట్లు చేసింది" శ్యామల వాద్ధోరణి సాగిపోతూనే వుంది.

"అసలు సంగతేమిటో చెప్పు శ్యామలా" అన్నాను పార్వతివైపు చూస్తూ. పార్వతి వంచిన తల యెత్తడం లేదు.

"దాన్నే అడుగు ఏం చేసిందో..అయితే అదేం చెబుతుందిలే. ఇలాంటి వాళ్ళని వూరికే వదల కూడదు పోలీసులకి పట్టిస్తే వాళ్ళే చూసుకుంటారు" శ్యామల కోపంతో వూగిపోతోంది.

పోలీసుల మాట వినగానే పార్వతి తలయెత్తి బెదురుగా నా వేపు చూసింది. అంతవరకూ మూగగానే వున్నామె వణికే గొంతుతో "అమ్మగారూ సత్తెప్రమాణంగా నేనా వుంగరం తియ్యలేదమ్మగారూ. పోలీసు బాబులొస్తే గొప్పోళ్ళ నొదిలేసి మా బోటి కూటికి లేని వాళ్ళనే చావబాది తప్పుచెయ్యకపోయినా తప్పు చేసేమని ఒప్పిస్తారు" చదువుకోనిదయినా పార్వతి చెప్పింది యూనివర్సల్ ట్రూత్.

"కూటికి లేనివాళ్ళమయినా, కులం తక్కువ వాళ్ళమయినా గుణంలో తక్కువ కాదమ్మగారూ" వస్తున్న దుఃఖాన్ని గొంతులోనే బలవంతంగా అణచుకొని బ్రతిమాలుతోంది పార్వతి.

విషయం కొంత అర్ధమయినా శ్యామల నోటితోనే విందామని "అసలేం జరిగింది శ్యామలా..ఉంగరమేమిటి..పోవడం ఏమిటి"

"నిన్ననే మా అమ్మ నాకోసం చేయించిన ముత్యపుటుంగరం మా తమ్ముడు చేత పంపించింది. అది నాకిచ్చేసి వాడు వుండమన్నా వుండక నిన్న సాయంకాలమే వెళ్ళిపోయాడు. నిన్ననంతా దాన్ని పెట్టుకొనే వున్నాను. ఉదయం స్నానానికి వెళ్ళినప్పుడు తీసి డ్రస్సింగ్ టేబిలు మీద పెట్టాను. తరువాత దాని సంగతే మరచిపోయాను. ఇందాక జ్ఞాపక మొచ్చి చూస్తే అది లేదు. పిల్లలు ఆయన బయటికెళ్ళిన తరువాతే నేను స్నానానికెళ్ళాను. ఇది నేను తప్ప యింకెవరం యింట్లో లేదు. దీని పని లేకపోతే యింకెవరు తీస్తారు. గతి లేకపోతే అడుక్కు తినాలి" శ్యామల నోరు పారేసుకుంటోంది.

"చూడు శ్యామలా తొందరపడకు. పార్వతి అలాంటిది కాదు. మా యింట్లో ఎన్నో సంవత్సరాలు మా మనిషిలాగే మసిలింది. పని మనిషని మేమెప్పుడు అనుకోలేదు. మరుదులు, ఆడపడుచులు ఎక్కడి వాళ్ళక్కడ కెళ్ళిపోవడంతో కొద్దిపనికే పనిమనిషెందుకులే అని మానిపించేద్దామనుకొంటూ వుంటే నీకు పనిమనిషి అవసరం అని చెప్పావు కదా అని పార్వతిని మీ యింటికి పంపాను. నువ్వే ఎక్కడో పెట్టి మరిచిపోయి వుంటావ్. మళ్ళీ మరొకసారి వెతుకు"

"ఆ..నువ్వలాగే చెపుతావు. నీ యింట్లో పట్టుకెళ్ళడానికి దానికేమీ దొరుకుండదు. ఇక్కడ ఎదురుగా కనిపిస్తూవుంటే బంగారం ఎవరికేనా చేదా" అంది శ్యామల.

ఇంతలో ఫోన్ రింగయింది. శ్యామల గదిలోకి వెళ్ళి ఫోన్ ఎత్తింది. కొంచెం సేపటికి మాటలాగిపోయాయి. కానీ శ్యామల ఎంతసేపటికి బయటికి రావడం లేదు. చూసి చూసి నేనే లోపలికెళ్ళా.

# విలువలు



శ్యామల ఖిన్నురాలయి నిలబడి వుంది. ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

"ఏమిటి శ్యామలా! ఏమయింది. ఎవరి దగ్గర నుండి ఫోన్, అంతా బాగున్నారా"

"జానకీ" శ్యామల గొంతు వణుకుతూ వుంది. "మా వారే ఫోన్ చేసారు. నేను స్నానానికెళ్ళిన తరువాత ఆయన ఏదో పనిమీద యింటికి తిరిగి వచ్చి పార్వతి, నేను యిద్దరం కనకపడక డ్రస్సింగ్ టేబిలు మీద ఉంగరం కనపడితే నా అజాగ్రత్తకి చిరాకు రాగా దానిని తీసి బీరువాలో కేష్ బాక్సులో పెట్టేసి అవసరమైన ఫైలు తీసుకొని వెంటనే వెళ్ళిపోయారట. పార్వతి నాకు కుంకుడు పులుసు పోస్తోంది. ఆ టైములో వచ్చుంటారు బహుశా. వెంటనే ఫోన్ చేద్దామనుకొన్నారట. కానీ పనిలో పడి మరచిపోయి వెతుక్కొని కంగారు పడతానేమో నని యిప్పుడు ఫోన్ చేసారు. నేను చాలా తొందరపడ్డాను జానకీ" అంది శ్యామల.

"అందుకే నిదానం ప్రధానం అన్నారు శ్యామలా. మన దగ్గర పనిచేస్తున్నారు కదా అని వాళ్ళని తక్కువ చేసి చూడకూడదు. బీదవాళ్ళయినంత మాత్రాన వాళ్ళంతా దొంగలేనా. సరే అయిపోయిందేదో అయిపోయింది. పార్వతికి సారీ చెప్పెయ్యి. కొంతయినా ఆమెకు తృప్తిగా వుంటుంది" అన్నాను.

"నేనా.." శ్యామల చిన్నతనంగా భావిస్తోంది.

ఇంతలో పార్వతి కలగజేసుకొని "వద్దమ్మా మీరే సారీలు చెప్పద్దు. మమ్మల్నిలా బ్రతకనిస్తే అంతే చాలు. ఆ ఉంగరం దొరికింది కాబట్టి సరిపోయింది. లేకపోతే నా గతేం కాను. వస్తానమ్మా..శెలవు" అంటూ మెల్లగా మెట్లు దిగిపోయింది.

శ్యామల చేష్టలుడిగి అలాగే పార్వతి వెళ్ళిపోతున్న వైపు చూస్తూండిపోయింది.

-వి.సత్యవతీదేవి (గుమ్మలక్ష్మీపురం)